క్లుప్తంగా

ప్రవీణ్‌కుమార్ అరెస్ట్ అప్రజాస్వామికం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మల్యాల: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అరెస్ట్‌ను నిరసిస్తూ శుక్రవారం మల్యాల మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీపై చైర్మన్ జనార్దన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ కార్యాలయంలో ప్రవీణ్‌కుమార్ ఆమరణ నిరాహార దీక్ష చేపడితే అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ స్థానిక బ్లాక్ చౌరస్తాలో దిష్టిబొమ్మ దహనం చేశారు.

ఆర్థిక చేయూత



సాయం అందజేస్తున్న నాయకులు

పెగడపల్లి: మండలంలోని నామాపూర్ గ్రామానికి చెందిన ఓ పేదింటి ఆడపడుచు వివాహానికి స్థానిక నాయకులు ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన మందపల్లి శంకర్–పద్మ దంపతుల కూతురు అనితకు వివాహం నిశ్చయమైంది. అనిత తండ్రి శంకర్ గతేడాది అనారోగ్యంతో మృతి చెందాడు. అనిత వివాహం చేసేందుకు తల్లి పద్మ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న పలువురు నాయకులు ఆర్థిక సాయం చేశారు. సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి రూ.5016, వైఎస్సార్‌టీపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కుమార్ రూ.5016, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు సంది మల్లారెడ్డి రూ.5016, ఎంపీటీసీ చిర్ర రజిత రూ.2016, ఉప సర్పంచ్ రూ.2016, ఎల్లిమిల్ల ప్రసాద్ రూ.1516 నగదు అందజేశారు. కాగా మాజీ ఎంపీటీసీ కొమురవెల్లి ఆనందం దంపతులు పుస్తెమెట్టెలు, విండో ఉపాధ్యక్షుడు సంకిటి కిషన్‌రెడ్డి, ఉప్పుల లక్ష్మారెడ్డి బియ్యం అందజేశారు.

రాబోయే ఎన్నికల్లో బీజేపీదే విజయం



మిఠాయిలు పంపిణీ చేస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: టీచర్స్ ఎమ్మెల్సీ ఫలితం ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముదుగంటి రవీందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, పాలమూరు జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి ఎ వెంకటనారాయణరెడ్డి గెలుపొందిన సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ సీనియర్ నాయకులు ఏసీఎస్ రాజు, చీటి చంద్రశేఖర్‌రావు, సుగుణాకర్‌రావు, జనార్దన్‌రెడ్డి, మారుతి, రాజేందర్, బిట్టు, జ్ఞానేశ్వర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

డ్రా పద్ధతిన మైనార్టీ రుణాలకు ఎంపిక



డ్రా తీస్తున్న ఎంపీడీవో ప్రభు

ఇబ్రహీంపట్నం: మండలంలోని మైనార్టీ రుణాల కోసం 30 మంది మైనార్టీలు దరఖాస్తు చేసుకోగా శుక్రవారం రెండో విడత డ్రా పద్ధతి ద్వారా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిక చేశారు. మొదటి విడత రూ.2లక్షల యూనిట్ ఒక్కటి, లక్ష రూపాయల యూనిట్లు రెండు రాగా డ్రా పద్ధతిన ఎంపిక చేశారు. పై అధికారుల ఆదేశాల మేరకు డ్రా పద్ధతిన ఎంపిక చేసినట్లు ఎంపీడీవో ప్రభు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, ఎంపీటీసీ తిమ్మణి రాములు, నాయకులు జాజాల జగన్‌రావు, రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న మైనార్టీలు పాల్గొన్నారు.

పరామర్శ

సారంగాపూర్: మండలంలోని పోచంపేట గ్రామానికి చెందిన తిరుమల శ్రీనివాస్ తాటి చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడగా శుక్రవారం ఆయనను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరామర్శించారు. శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు ఎమ్మెల్సీ తెలిపారు. ఆయన వెంట నాయకులు బేతి శంకర్‌రెడ్డి, ఆకుల రాజిరెడ్డి ఉన్నారు.

స్పెషల్ డ్రైవ్ విజయవంతం

- తొమ్మిది గ్రామాల్లో వందశాతం ఇంటిపన్ను వసూలు
- కథలాపూర్ మండలంలో 95శాతం..
- ప్రజల సహకారం, సిబ్బంది కృషితో అనుకున్న లక్ష్యం పూర్తి



కథలాపూర్‌లో ఇంటిపన్ను వసూలు చేస్తున్న కార్యదర్శి, సిబ్బంది

కథలాపూర్: ప్రజల్లో చైతన్యం, ప్రజల సహకారం ఉంటే అధికారులు అనుకున్న లక్ష్యం సాధించవచ్చు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు గ్రామపంచాయతీల్లో నిల్వ ఉండే నిధులే ప్రధానం. ఇదే ఆ గ్రామాల ప్రజల్లో చైతన్యం నింపడంతో బకాయిపడిన ఇంటిపన్నును వందశాతం చెల్లించారు. గ్రామాల్లోని ప్రజలు ఇంటి పన్ను వందశాతం చెల్లించి మండలానికే ఆదర్శంగా నిలిచారు. అధికారులు కూడా సిబ్బందితో వారానికోసారి స్పెషల్ డ్రైవ్ చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించారు.

వందశాతం వసూలు లక్ష్యం..

ఇంటిపన్ను బకాయిలు లక్షలాది రూపాయలు పేరుకుపోవడంతో అధికారులు సైతం అయోమయానికి గురయ్యారు. ఇంటిపన్ను వసూలు చేయడానికి కఠిన నిర్ణయం తీసుకుంటే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని భావించి.. ఇంటిపన్ను వసూళ్లకు సిబ్బందితో వారానికోసారి గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. కథలాపూర్ మండలంలో 19 గ్రామాలకు గాను రూ.51.94లక్షలు ఇంటి పన్ను బకాయిలున్నాయి. బకాయిలు వసూలు చేయాలని అధికారులు చెప్పినప్పటికీ కొన్ని గ్రామాల్లో పట్టించుకోలేదు. మరికొన్ని గ్రామాల్లో సిబ్బంది కష్టపడి వసూలు చేశారు. మార్చి వరకు మండలంలో వందశాతం ఇంటిపన్ను వసూలు చేయాలని అధికారులు సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఈనెల 17 వరకు మండలంలో రూ.49.35 లక్షలు ఇంటిపన్ను వసూలైనట్లు అధికారులు వెల్లడించారు. దీంతో మండలంలో 95 శాతం ఇంటిపన్ను వసూలు కావడం విశేషం.

తొమ్మిది ఆదర్శ గ్రామాలు

కథలాపూర్ మండలంలో 9 గ్రామాల్లో వందశాతం ఇంటిపన్ను వసూలు చేశారు. అంబారిపేట, దుంపేట, గంభీర్‌పూర్, ఇప్పపెల్లి, కలిగోట, ఊట్‌పల్లి, పోతారం, రాజారాం తండా, సిరికొండ గ్రామాల్లో వందశాతం ఇంటిపన్ను వసూలు చేసి ఆదర్శంగా నిలిచారని కార్యదర్శులను, గ్రామ సిబ్బందిని, సర్పంచులను మండలాధికారులు అభినందించారు.

వాడల వారీగా లక్ష్యం..



ఇంటిపన్ను బకాయిలను వసూలు చేయడానికి ప్రతి ఇంటికీ ముందస్తుగా సిబ్బందితో బిల్లులు పంపిణీ చేశాం. ఆ తర్వాత వాడల వారీగా లక్ష్యం పెట్టుకొని ఇంటిపన్ను వసూలు చేశాం. సిబ్బంది ఇంటింటా తిరిగి ఇంటిపన్ను వసూలు చేయడం సులువుగా మారింది. ఎట్టకేలకు ఆర్థిక సంవత్సరానికి ముందే వందశాతం ఇంటిపన్ను వసూలు కావడం సంతోషంగా ఉంది.

– గోపు శ్రీనివాస్, సర్పంచ్, అంబారిపేట

ప్రజల సహకారం, సిబ్బంది కృషి



ఇంటిపన్ను వసూలుపై అన్ని గ్రామాల్లో గ్రామపంచాయతీ సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశాం. కొన్ని గ్రామాల్లో ప్రజల నుంచి అంతంతగానే స్పందన వచ్చింది. మండలంలోని 9 గ్రామాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది సహకరించడంతో ఇంటిపన్ను వందశాతం వసూలు కావడం సంతోషంగా ఉంది. అన్ని గ్రామాల్లో వందశాతం ఇంటిపన్ను వసూలు చేయడానికి సిబ్బందిని ప్రోత్సహిస్తున్నాం.

– జనార్దన్, ఎంపీడీవో, కథలాపూర్

అటెన్షన్ ప్లీజ్



లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు

సారంగాపూర్: మండల కేంద్రంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్మించిన బస్టాండ్ నిరుపయోగంగా మారింది. బస్టాండ్ నిర్మాణం కోసం 15 ఏళ్ల క్రితం గ్రామంలో ఉచితంగా భూమిని అందించారు. ఈ భూమిలో రూ.10 లక్షలతో అన్ని వసతులతో బస్టాండ్ నిర్మించారు. అయితే బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో, గ్రామస్తులు బస్టాండ్‌లోకి బస్సులు రావాలని కోరారు. దీంతో ఏడాది క్రితం నుంచి బస్టాండ్‌లోకి బస్సులు వచ్చాయి. కానీ 6నెలల నుంచి తిరిగి బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో సెర్ప్ వారు బస్టాండ్‌లో వరిధాన్యం పట్టే యంత్రాలను నిలుపడానికి వినియోగిస్తున్నారు.

సంప్రదించాల్సిన అధికారి పేరు : వెంకటనర్సప్ప, డిపో మేనేజర్, జగిత్యాల
ఫోన్ నంబర్: 99592 25925

పట్టణంలోని సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న కౌన్సిలర్లు

ధర్మపురి: పట్టణంలో కొంత కాలం నుంచి నెలకొన్న వివిధ సమస్యలపై అడిషనల్ కలెక్టర్ మంద మకరంద్‌కు వినతిపత్రం సమర్పించామని శుక్రవారం కాంగ్రెస్‌కు చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు వేముల నాగలక్ష్మి, జక్కు పద్మ, సంఘటనభట్ల సంతోషి తెలిపారు. ధర్మపురిలో నెలకొన్న సమస్యల్లో కుక్కల బెడద, వాటి సంతతి రోజురోజుకూ పెరుగుతోందని, వాటితో ప్రజలు, పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వాటిని నివారించాలని కోరారు. అదేవిధంగా పట్టణంలో పశువులు రోడ్లపై గుంపులు గుంపులుగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పశువుల యజమానులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలో కొన్నేళ్ల నుంచి తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని కమలాపూర్‌లోని బోల్ చెరువు నుంచి ప్రత్యేక పైపులైన్ వేసినప్పటికీ ఆ చెరువులోని నీరు అడుగంటిందని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీటికి పైపులైన్ లీకేజీలతో తరచూ అంతరాయం కలుగుతోందని తాగునీటి కోసం శాశ్వత పరిష్కారం చూపాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గరిగె అరుణ ఉన్నారు.

అక్రమ లేఅవుట్ సరిహద్దు రాళ్ల తొలగింపు

కోరుట్లటౌన్: పట్టణంలో లేఅవుట్ అనుమతి లేకుండా 15 ఎకరాల్లో ఉన్న హద్దురాళ్లు తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.డీ అయాజ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని కల్లూర్‌రోడ్, ఐలాపూర్ రోడ్, జగిత్యాల రోడ్, మెట్‌పల్లి రోడ్, ఆదర్శనగర్, హాజీపుర, 18వ వార్డు సద్దినాలా ఏరియాల్లో సర్వే నెంబర్ 326, 327, 940, 941, 458, 451, 452, 453, 1283, 1463, 762, 783, 790లో సుమారు 15 ఎకరాల్లో అక్రమంగా వేసిన ప్లాట్ల హద్దురాళ్లు తొలగించినట్లు ఆయన వెల్లడించారు. హద్దురాళ్లు తొలగించిన ఏరియాల్లో ప్లాట్లు కొనుగోలు చేయొద్దని మున్సిపల్ కమిషనర్ సూచించారు. మున్సిపల్ అనుమతి ఉన్న ప్లాట్ల స్థలాలు ప్రజలు కొనుగోలు చేసి, పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఎమ్మెల్సీ విజయం బీజేపీ గెలుపునకు నాంది



టపాసులు పేల్చుతున్న నాయకులు

పెగడపల్లి: హైదరాబాద్ ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి విజయం.. రానున్న సాధారణ ఎన్నికల్లో బీజేపీ విజయానికి నాంది కానుందని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం అన్నారు. ఎమ్మెల్సీగా ఏవీఎన్‌రెడ్డి గెలుపొందిన సందర్భంగా శుక్రవారం పెగడపల్లిలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాలన గాలికొదిలేసి ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవితను కాపాడేందుకు ఢిల్లీ చెక్కర్లు కొడుతున్నారని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ అమలుకు ఆచరణ కాని హామీలిచ్చి రాష్ట్ర ప్రజలు, నిరుద్యోగ యువతను మోసం చేసిందని ఆరోపించారు. నాయకులు కొమురెల్లి, శోభన్‌బాబు, సతీశ్, కిషోర్, రమేశ్, రఘు పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో బీజేపీ సంబరాలు

మెట్‌పల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన ఏవీఎన్ రెడ్డి విజయం సాధించడంపై పట్టణంలో శుక్రవారం ఆ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్ వద్ద టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్‌తో పాటు నాయకుడు దొనికెల నవీన్ ఉన్నారు.

అలరించిన వీడ్కోలు వేడుక



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

కోరుట్లరూరల్: పట్టణంలోని కేరళ హైస్కూల్‌లో గురువారం రాత్రి నిర్వహించిన వీడ్కోలు వేడుక అలరించింది. ఈ సందర్భంగా ఎస్సై సతీశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఎంఈవో గంగుల నరేశం, పాఠశాల కరస్పాండెంట్ ఎంఎ బారి, ప్రిన్సిపాల్ సెలీనా బారి, పీఆర్‌బీఎం కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦20న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

కోరుట్లటౌన్: పట్టణంలోని శ్రీఅరుణోదయ డిగ్రీ కళాశాలలో 20న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ పోతని ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ పోతని నవీన్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టైమ్స్‌ప్రో సహకారంతో ఇప్పటికే శాశ్వత ప్రాతిపదికన ఐసీఐసీఐ బ్యాంకు ఇంటర్వ్యూలో 88 మంది ఎంపికైనట్లు తెలిపారు. డిగ్రీ, బీటెక్‌లో 50 శాతం మార్కులు ఉండి, 26 లోపు వయసు ఉన్నవారు ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 81067 64653, 78939 22966 నంబర్లను సంప్రదించాలన్నారు.

✦చలో ఢిల్లీ కార్యక్రమానికి తరలిరావాలి

మెట్‌పల్లి: బీసీ సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 3, 4 తేదీల్లో చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలి రావాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జెట్టి నరేంద్ర శుక్రవారం కోరారు. బీసీ జనగణనతో పాటు పలు సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దీనికి నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, బీసీలు అధిక సంఖ్యలో తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

✦ఇబ్రహీంపట్నంలో ప్రతీ సోమవారం ప్రజావాణి

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశాల మేరకు ప్రజావాణి నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేశ్వర్ శుక్రవారం తెలిపారు. ఈ ప్రజావాణికి ఎంపీడీవో, ఎంపీవోతో పాటు మండలస్థాయి అధికారులు హాజరవుతారని తెలిపారు.

✦గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడగింపు

మెట్‌పల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈనెల 20 వరకు పొడగించినట్లు ప్రిన్సిపాల్ సరిత తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

✦నేడు మైనార్టీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపిక

జగిత్యాలరూరల్: జగిత్యాల మండల పరిషత్ పరిధిలో మైనార్టీ కార్పొరేషన్‌లో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను శనివారం ఉదయం 11 గంటలకు లక్కీడ్రా పద్ధతిన ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీవో శైలజరాణి తెలిపారు.

✦25న మండల సర్వసభ్య సమావేశం

మల్లాపూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 25న మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ అధ్యక్షురాలు కాటిపెల్లి సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజశ్రీనివాస్ శుక్రవారం తెలిపారు.

✦నేడు పెగడపల్లిలో మంత్రి పర్యటన

పెగడపల్లి: మండలంలో శనివారం మంత్రి కొప్పుల ఈశ్వర్ పర్యటించనున్నారు. మండలంలోని నందగిరిలో డబుల్‌బెడ్రూం ఇళ్ల ప్రారంభం, అయితిపల్లిలో కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన, పెగడపల్లిలో రెడ్డి సంక్షేమ సంఘం కల్యాణ మండపానికి భూమిపూజ చేస్తారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో జరిగే ఏఎంసీ నూతన పాలకవర్గం కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి తెలిపారు.

✦కేజీబీవీ విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లు

కథలాపూర్: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా 30మంది విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేసినట్లు వారు పేర్కొన్నారు.

గంగామాత ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ నేమూరి లత

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని పెద్ద చెరువు వద్ద గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్మించే గంగామాత ఆలయ నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ నేమూరి లత భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాంరెడ్డి, నాయకులు నేమూరి సత్యనారాయణ, గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వాల్గొండలో హనుమాన్ దీక్ష స్వీకరణ



హనుమాన్ దీక్షదారులు

మల్లాపూర్: మండలంలోని వాల్గొండలో శుక్రవారం హనుమాన్ దీక్ష పీఠం వ్యవస్థాపకుడు, అర్చకులు బల్యాపెల్లి శశికాంత్ శర్మ ఆధ్వర్యంలో 21రోజుల హనుమాన్ దీక్ష స్వీకరణ కార్యక్రమం ప్రారంభమైంది. అర్చకులు శశికాంత్ శర్మ 200 మంది భక్తులకు హనుమాన్ దీక్షకు సంబంధించి మాలధారణ చేశారు. కార్యక్రమంలో హనుమాన్ దీక్షదారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందుతున్నాయా?



ప్రజలతో కలిసి నడుస్తున్న ఎమ్మెల్యే సంజయ్

సారంగాపూర్: 'మీరు నేను' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ రాత్రి 9 గంటల ప్రాంతంలో మండలంలోని రంగపేట గ్రామానికి చేరుకున్నాడు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించిన అనంతరం ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా రాత్రి రంగపేటలో పల్లె నిద్రలో భాగంగా అక్కడే బసచేశారు. ఉదయం రంగపేట, ఒడ్డెరకాలనీ గ్రామాల్లో పర్యటిస్తారు. ఆయన వెంట ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, సర్పంచ్‌లు బొక్కెం జమున, పల్లపు వెంకటేశ్ పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ప్రతిభ ఫౌండేషన్

జగిత్యాలరూరల్(రాయికల్): నిరుపేద మహిళలకు అండగా మదర్ ప్రతిభ ఫౌండేషన్ అండగా ఉంటుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కొనియాడారు. ఈ మేరకు శుక్రవారం రాయికల్ మండలం మైతాపూర్‌లోని బుడిగజంగాల కాలనీలో ఫౌండేషన్ ద్వారా 10మంది నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లు ఉచితంగా అందించడంతో వారికి స్వయం ఉపాధి లభిస్తుందన్నారు. ఎంపీపీ సంధ్యారాణి, సర్పంచ్ అజారొద్దీన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గన్నె రాజిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తలారి రాజేశ్, ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు కావ్య, నాయకులు అమరేందర్, చిన్నకిష్టయ్య, గంగారెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

మెట్‌పల్లి లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



నారాయణరెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

మెట్‌పల్లి: మెట్‌పల్లి లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని డిస్ట్రిక్ గవర్నర్ లయన్స్ నారాయణరెడ్డి కొనియాడారు. ఈ మేరకు పట్టణంలోని మహాజన్ గార్డెన్‌లో శుక్రవారం జరిగిన క్లబ్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మెట్‌పల్లి లయన్స్ క్లబ్ విస్తృత సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకుందన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షులు కట్కం రాకేశ్, శ్రీనివాస్, ఇందూరి రాకేశ్, ఉషాకిరణ్, కోట గంగజీవన్, మహాజన్ నర్సింహులు, వడ్డెపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాల: ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఒంటి పూట బడులు నిర్వహిస్తున్నారని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పలు పాఠశాలల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల యజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఒంటిపూట సెలవులు ఇవ్వని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వర్కింగ్ కమిటీ సభ్యులు సాయికుమార్, నందు, కార్తీక్, శ్రీనివాస్, ప్రశాంత్, మనోహర్, వంశీ, అంజి, రఘు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో ప్రజాప్రతినిధులు, అధికారులు

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులు భూమిపూజ చేశారు. గ్రామపంచాయతీ భవనం నిర్మాణానికి ఉపాధిహామీ పథకం నిధులు రూ.20 లక్షలు మంజూరైనట్లు అధికారులు పేర్కొన్నారు. సర్పంచ్ భైర హేమలత, ఎంపీటీసీ బొడ్డు బాలు, ఉపసర్పంచ్ లోక నర్సారెడ్డి, కార్యదర్శి మోహన్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రాంగణం పరిశీలన



పరిశీలిస్తున్న ఎంపీపీ రేవతి, అధికారులు

కథలాపూర్: కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణాన్ని ఎంపీపీ జవ్వాజి రేవతి, మండలాధికారులు శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు వీలుగా స్థలం చదును చేయించే విషయంలో చర్చించారు. మట్టి పోసి చదును చేయించాలని అధ్యాపకులు కోరారు. జూనియర్ కళాశాలతోపాటు మోడల్‌స్కూల్‌ను పరిశీలించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో జనార్దన్, ఎంపీవో గంగాధర్, ఏఈ ఆదిత్య, ప్రిన్సిపాల్ గౌసుర్ రహమాన్, లెక్చరర్లు ఉన్నారు.